91

# వెలిగించని దీపాలు

హాస్పిటల్ మెట్లెక్కుతున్న డాక్టర్ రాధాకృష్ణ అకస్మాత్తుగా ఆగిపోయాడు. కాదు, అతను ఆగిపోవాల్సి వచ్చింది. ఓ పద్నాలుగేళ్ళ కుర్రాడు ధామ్మున అతని ముందు పడి పాదాలు పట్టేసుకున్నాడు.

"గులాపోణ్నిదొరా. మా అమ్మ చచ్చిపోతంది. రచ్చించండి దొరా"

ఓ మూల బీడీ కాల్చుకుంటూ నిలబడ్డ గేట్‌మాన్ ఈ దృశ్యం చూసి బీడీ అవతల పారేసి పరుగెత్తుకొచ్చాడు.

"ఉఠో సాలే, చోడో సాబ్ కా పాంవ్"

చేతిలో లాఠీ... మూడు రోజుల్నుంచీ అతని వాలకం చూస్తూ భయపడి పోయాడు.

"ఫర్వాలేదు. లే... ఏమైంది?'

కుర్రాడు లేచాడు.

"నీ పేరేంటి?"

"యెంక్‌టేసు దొరా!"

మాసిన చారల తలపాగా, కావిరంగు అంగవస్త్రం, ఎండకు ఎండి, వానకు తడిసి పోషణలేక కావి రంగుగా మారిన తెల్లటి శరీరం... ఇవన్నీ కలిసి వెంకటేసుగా డాక్టరు రాధాకృష్ణ ముందు నుంచున్నాయి. ఆ కళ్ళ నిండా దైన్యం వుంది. ఒంటి నిండా దరిద్రం వుంది. ఈ వ్యవస్థ ఏరిపారేసిన నాసిరకం మనిషిలా ఉన్నాడు వెంకటేశు.

"ఏమైంది మీ అమ్మకు?" అడిగాడు రాధాకృష్ణ

"ఏమైందో తెల్వద్దొరా... మాట లేదు మంతి లేదు... పెయ్యి గడగడ లాడిపోతది."

"ఇప్పుడెక్కడుంది?"

"అదొ, ఆ చెట్టుకింద ఉన్నదే మా అమ్మదొరా."

"అరె! నాలుగు రోజుల్నుంచీ అక్కడే వుంది కదయ్యా!"

"అవ్ దొరా. నాల్గు దినాల్నుంచి దినాం కోషిష్ చేస్తున్న.లోపల్కి రానియ్యలా."

"ఎందుకని" గేట్‌మాన్‌ను అడిగాడు.

"లాభంలేదు సాబ్. శాన ఖరాబుగుంది, బతకదు."

"అది చెప్పాల్సింది నువ్వు కాదు."

"చిత్తం"

లాభం లేని కేసులన్నీ నువ్వే పరీక్షించి పంపేస్తున్నావనుకుంటాను"

"నై సాబ్..."

"సరే... పంపించు లోపలికి"

వెళ్లిపోయాడు డాక్టరు రాధాకృష్ణ

"లోపలి కెల్తే మాత్రం ఏం ఫాయ్దా? మూడు దినాల్నుంచి సెప్తనే వున్న- పెద్ద దొర్ని సూడంది పనవ్వదు"

"పైసల్లేవు దొరా! గరీబోణ్ని"

"పోనీ చాయి కన్న పైసలిస్తవా?"

వెంకటేశు తలపాగా విప్పాడు. ఆ మాసిన తువ్వాలు మూల భద్రంగా వున్న ముడి విప్పి రూపాయి తీసాడు.

"ఆఠానా వాపసియ్యి దొరా."

తీసుకున్నాడు గేటుమేన్ ఖాన్.

"చిల్లర పైసల్లేవు."

"నీకాల్మొక్తా- అట్టగనక దొరా! నాకెల్లింక పైసల్లేవు. చాయన్న తాక్కుండ దాసి పెట్న...'

"యీడనే వుంటవ్‌గా సూద్దంలే"

ఇంతలో ట్రాలీ వచ్చింది.

"కౌన్‌బే ఇక్కడ ముసిల్ది?"

"అద్గొ! డాక్టరు సాబ్ ట్రాలీ తోలించిండు. ఇయాల నీ యద్రుష్టం సాఫ్‌గుంది. సీయవ్వ పెయ్యి మంచిగవుద్ది"

తల్లి రోగం తగ్గిపోయినట్టే సంబర పడ్డాడు వెంకటేశు. చిల్లర మాటే మర్చిపోయాడు.

* * *

ఆపరేషన్ థియేటర్ చాల హడావుడిగా వుంది. లోపలి కెళ్ళిన రోగుల తాలూకు మనుషులు ఆతృతగా అటువైపే చూస్తూ కూర్చున్నారు. అక్కడ కూర్చోడానికి బల్లలున్నా అవతల దూరంగా, నేలమీద; చిలుంపట్టిన రాగి విగ్రహంలా స్తంభానికి ఆనుకుని కూర్చున్నాడు వెంకటేశు. లోపలికెళ్ళేముందే అతని వీపు తట్టి చెప్పాడు రాధాకృష్ణ

"భయపడకు. ముందు మీ కేసే చేస్తున్నాను, బాగవుతుంది."

ఆమాటలే వినపడుతున్నాయి వెంకటేశుకు. ఆ రూపమే కన్పిస్తోంది. మనసులోనే మొక్కుకున్నాడు. దేవుడికి కాదు- డాక్టర్‌కు. తన తల్లి బతికి బాగుపడాలని కాదు- ఇలాంటి బాబులు పది కాలాల పాటు బతకాలని,

పెద్ద డాక్టర్ లోపలికెళ్ళాడు.

వెళ్ళిన అరగంటకి తన తల్లిని మోసుకుని బయటికొచ్చింది ట్రాలీ. వెనకాలే డాక్టర్ రాధాకృష్ణ

"దొరా... మంచిగయిందా, దొరా?"

గుండెలు ఆతృతగా, భయం భయంగా కొట్టుకుంటుంటే- తడబడే కాళ్ళతో నిలబడి చేతులు కట్టుకుని అడిగాడు.

"తర్వాత చెపుతాను. నువు బయట నిలబడు వెంకటేశూ."

మళ్ళీ లోపలికెళ్ళిపోయాడు డాక్టర్.

తల్లిని వార్డులోకి తీసికెళ్ళిపోయారు.

డాక్టర్ కోసం బయట కాచుక్కూర్చున్నాడు వెంకటేశు.

"ఎట్లగుంది దొరా?"

డాక్టర్ రాధాకృష్ణ గేట్‌మెన్‌ను పిల్చాడు.

"ఖాన్, షిఫ్టు అయిపోగానే ఇతనికి పెద్దదొర ఇల్లు చూపించు. చూడు వెంకటేశూ...సాయంత్రం పెద్ద దొరను కలిసి ఈ డబ్బివ్వు..."

* * *

సాయంత్రం వెంకటేశు కోసం ఎదురు చూస్తున్నాడు డాక్టర్ రాధాకృష్ణ అయిదు గంటల ప్రాంతంలో అతణ్ణి వెంటబెట్టుకొచ్చాడు ఖాన్. రాధాకృష్ణను చూడగానే బావురు మన్నాడు వెంకటేశు.

"బుడ్డీ మరగయా సాబ్" చెప్పాడు ఖాన్.

రాధాకృష్ణ కృంగిపోయాడు.

"రోజూ ఇలా ఎంత మంది చచ్చిపోతున్నారో..."

కోపం, అలసత్వం ఆక్రమించుకున్నాయి అతన్ని.

'నువెళ్ళిపో ఖాన్...'

"ఏడవకు వెంకటేశూ!"

"నాకింక దిక్కులేదు దొరా?"

"ఏడిస్తే మాత్రం వస్తుందా... ఊరుకో!"

ఊరుకోమని అన్నాడేగాని అతనికీ దుఃఖం ఆగింది కాదు. తన చిన్నతనంలోనే కారు ప్రమాదంలో తల్లీ తండ్రి పోయారు. ఇప్పుడే అయితే తానూ అంతగానే దుఃఖించేవాడు మరి!

"నాతో రా వెంకటేశూ..."

మేడ మెట్లెక్కుతున్నాడు. అతన్ని అనుసరించాడు వెంకటేశు.

డాక్టర్ రామచందర్ తన స్టడీ రూంలో కూర్చొని ఏదో మెడికల్ జర్నల్ చదువుతున్నాడు. అతని ముఖం కన్పించటం లేదు. పైపు తాలూకు పొగ మాత్రం పైకి లేస్తోంది.

"అంకుల్!"

"య్యాస్... కమీన్!"

"మీ కోసం...'

జర్నల్ అవతల పారేసి కూర్చున్నాడు.

"ఊఁ... ఏం కావాలి?"

"ఇవ్వు వెంకటేశూ...కన్సల్టేషన్ యిచ్చెయ్యి."

వెంకటేశుకు నోట మాటరావటంలేదు. చేతులు వణుకుతున్నాయి. నోట్లు టీపాయ్ మీద పెట్టి అలాగే నుంచున్నాడు.

తను లంచాలు తీసుకుంటాడని డాక్టర్ రాధకు కోపం. అలాంటివాడు తనే ఇవాళ కేసు పట్టుకొచ్చాడు. డాక్టర్ రామచంద్రకు ఆశ్చర్యంగా వుంది.

"పొద్దున్న మీరు ఆపరేషన్ అక్కర్లేదని తిప్పేసిన కేసు. ఆమె కొడుకు."

"నువ్విక వెళ్ళవోయ్... రేపు చూస్తాలే."

వెంకటేశు బయటికి నడిచాడు.

"ఏవిటి రాధా! నీ ప్రవర్తన అదోలా అనిపిస్తోంది ఇవాళ"

"ఆమె బతుకు తుందంటారా అంకుల్?"

"ఆపరేషన్ చేస్తే బతకచ్చు"

"మరి అక్కర్లేదన్నారుగా.."

డాక్టరు రామచంద్ర తడబడ్డాడు.

"అక్కర్లేదన్నానా... ఊం... అవును అప్పుడు లో బి.పి. పేషెంట్ ఈజ్ హైలీ టాక్సిక్..."

"నో... అన్నీ బాగానే వున్నాయి" అరిచాడు రాధ.

"నేను సర్జన్‌ను. ఎప్పుడు చెయ్యాలో నాకు తెల్సు."

"ఇప్పుడు చేస్తారా?"

"అవును..."

"పోస్టుమార్టమ్?"

"ఏమిటి నువ్వంటున్నది?"

"అవును అంకుల్! మీ పుణ్యమా అంటూ ఆమె స్వర్గం చేరుకుంది."

"అయితే తెలిసుండి కూడానాకు డబ్బు ఇప్పించటంలో నీ వుద్దేశ్యం?"

"మీరు డబ్బు మనుషులు కనుక!"

"ఆ డబ్బుతోనే నువ్వు పెరిగి ఇంతటివాడి వయ్యావని నీకు తెల్సా."

"తెలుసు. అదే నా విచారం. అమ్మా నాన్నా పోయి దిక్కులేని వాణ్ణిగా ఏ రోడ్ల మీదైనా ముష్టెత్తుకుంటున్నా సుఖంగా వుందునేమో!"

"ఎప్పటి నుంచి యీ కష్టం?"

"ఊహ తెల్సినప్పట్నుంచీ."

"పాపం! మరెందుకు భరిస్తున్నావో."

"ఇక భరించలేను. ఒక్క క్షణంకూడా ఇక్కడ ఉండలేను."

"అవును రెక్కలొచ్చాక ఎగిరిపోవటం పక్షిలక్షణం."

"అది ప్రసాదించినందుకు జీవితాంతం కృతజ్ఞతగా వుంటాను."

"ఫర్వాలేదు. ఆ మాత్రం కృతజ్ఞత వుంది."

"కృతఘ్నుడిగా ఎప్పుడూ లేను అంకుల్."

"ఇంతకు ముందు లేవు. ఇప్పుడు."

"ఇప్పుడు కూడాను."

"మరి ఇప్పుడు ఇల్లు వదిలి వెళ్ళిపోవటం... సరే, మరి నిన్నేనమ్ముకున్న సరళ సంగతి?"

"అది ఆమె తేల్చుకోవల్సిన విషయం-

విసురుగా అక్కణ్నుంచి సరళ గదికి వెళ్ళేడు. ఆమె చదువుకుంటోంది. వెళ్ళగానే

"సరూ..." అని పిల్చాడు హడావిడిగా

"ఊ... ఏవిటి హడావిడి" అంది నవ్వుతూ,

"హడావిడి కాదు సరూ చాల సీరియస్ విషయం."

"ఏవిటో..."

"నేనంటే నీ కిష్టమేనా?"

ఆమె విరగబడి నవ్వింది.

"ఇదండీ డాక్టర్ గారూ సీరియస్ విషయం?"

"నవ్వులాట కాదు సరూ..."

"అసలా సందేహం ఎందుకొచ్చింది?"

"పోనీలే అది ఒదిలెయ్! ఇప్పటి కిప్పుడు నా కూడా ఒచ్చెయ్య గలవా?"

"ఎక్కడికి?"

"నేనెక్కడి కెళితే అక్కడికి"

"నేనూ ఓ మాటడుగుతా చెప్తావా?"

"ఊ...."

"నీకు నేను కావాలా?"

"తప్పక కావాలి"

"అయితే ఇక్కడే వుండు"

"అసంభవం!!"

"అయితే నేను రావటంకూడ అసంభవమే. పుట్టిన యిల్లు, కన్న తండ్రిని ఒదిలేసి దిక్కులేనిదాన్లా కట్టుబట్టలతో నీ వెంట ఒచ్చెయ్యమంటావా?"

"అదంతా నా కనవసరం. ఒస్తావా, రావా?"

"రాలేను."

"ఆల్‌రైట్ వెళుతున్నాను."

"నిజంగానే..."

* * *

రాయవెల్లూరు క్రిష్టియన్ హాస్పిటల్.

ఒక గదిముందు "డా॥ ఎం.ఆర్.కృష్ణ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ నెఫ్రాలజీ" అని బోర్డు వుంది.

వార్డు బోయ్ ఏవో కాగితాలూ, ఎక్స్‌రేలూ పట్టుకుని ముందు నడుస్తున్నాడు. అతని వెనక ఒక వృద్ధుడూ వయసులో వున్న ఒక అమ్మాయి నడుస్తున్నారు.

"మీరు ఇక్కడే కూర్చోండి"

వార్డు బోయ్ లోపలి కెళ్ళాడు.

"సర్..."

"ఎస్..."

"నిన్న మీరు లేరు. ఒక పేషెంటు రిజిష్టరయింది. ఎక్స్‌రేలూ రిపోర్టులూ వచ్చాయి."

పరీక్షించాడు డాక్టర్.

"వెరీ బేడ్..."

"పిలవమంటారా?"

"ఊ..."

ఇద్దరూ లోపలికొచ్చారు.

"కూర్చోండి..." ఎక్స్‌రే చూస్తూనే అన్నాడు.

"బోత్ ఆర్ డేమేజ్డ్"

"డాక్టర్..."

డాక్టర్ అటు చూశాడు.

"అంకుల్ మీరా....?" లేచినుంచున్నాడు.

"సరూ.... నువ్వేనా.. ఏవిటి సరూ అలా వున్నావ్."

ఆమె మాట్లాడలేదు.

"నేనిక్కడున్నట్లు తెల్సా అంకుల్?"

"ఉహు..."

" ఇంత డిలే ఎందుకు చేశారు అంకుల్. ఇప్పుడు మిమ్మల్ని ఎలా బతికించుకోవాలి?"

"రాధా!!"

"అవును అంకుల్. మీరు డాక్టర్. యక్సరే చూస్తే తెలియటంలా"

"నాకు కాదు నాయనా... సరళకి.."

"సరూ....?!"

కూర్చుండిపోయాడు.

పది నిముషాల తర్వాత వార్డుబాయ్‌ని పిల్చాడు.

"వెంకటేశూ... డాక్టర్‌జాకబ్స్‌ని పిల్చుకొస్తావా?"

"అలాగే వీరిని తీసికెళ్ళి మన క్వార్టర్సులో దించిరా."

"ఒద్దు రాధా- మేం రూం తీసుకున్నాం"

డాక్టర్ జాకబ్స్ వచ్చాడు.

"డాక్టర్, వెంటనే ఒక కిడ్నీ ట్రాన్స్‌ప్లేంటేషన్ జరగాలి."

"స్పేరుందా?."

"ఉహు.. నన్ను టెస్టు చెయ్యండి."

"మీరిస్తారా? నో... మీరు లేకుంటే ఆపరేషన్ ఎట్లా జరుగుతుంది?"

"మీరే చెయ్యాలి."

"ఇంపాసిబిల్"

"మరెట్లా... ఆలస్యం చేస్తే పేషెంటుబతకదుఎలాగైనా పేషెంటును బతికించాలి డాక్టర్."

"నాది ఇస్తాను సర్..."

"వెంకటేశూ!!"

"అవున్ సర్! నా కిడ్నీ ఇస్తాను పరీక్ష చెయ్యండి సర్,"

అదృష్టం కొద్దీ వెంకటేశు టిస్యూస్ సరళకు సరిపోయాయి,

కిడ్నీ మార్పిడి విజయవంతమైంది.

* * *

సరళ కోలుకుంది. ఆవాళనే ఇంటికి బయల్దేరబోతున్నారు.

చాలా కాలంతర్వాత రాధాకృష్ణతో కలిసికూర్చుంది సరళ.

రాధ అడిగేడు.

"మీవారు రాలేదేం సరూ?"

ఆమె పేలవంగా నవ్వి,

"ఆయన చాల బిజీ మనిషి..తీరిక లేదు."

"మరి మీ శ్రీమతిని చూపించలేదే?"

శ్రీమతా?... అవును శ్రీమతి పుట్టింటికెళ్ళింది."

"ఎంత మంది పిల్లలు?"

"ముగ్గురు... నీకు?"

"నలుగురు..."

అబ్బో! నాకంటె ఎడ్వాన్సుగానే వున్నావు."

ఎవరికీ నవ్వు రాలేదు.

ఇద్దరి ముఖాల్లోనూ జీవం లేదు.

బయల్దేరే ముందు ఇద్దరూ ఒకర్నొకరు చూసుకున్నారు. ఇద్దరి కళ్ళూ బరువుగా మూసుకున్నాయి.

కారు బయల్దేరింది.

మెళ్లో వున్న లాకెట్ తీసి రాధ ఫోటో చూసి నిట్టూర్చింది సరళ.

కారు కనుమరుగయ్యేవరకూ చూశాడు రాధ.

జేబులో పర్సు తీసి చూసుకున్నాడు. పర్సులో సరళ నవ్వుతోంది.

●

*(స్వాతి, డిసెంబర్ 1975)*